క్లుప్తంగా

బల్లల వితరణ



బల్లలు అందజేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: మండలంలోని సలగంగనగర్‌లో గల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో సోమవారం మరమ్మతులు చేసిన 70 బల్లలను వితరణ చేశారు. ఇటీవల మున్నేరుకు వచ్చిన వరదల వల్ల పాఠశాలలో సామగ్రి పూర్తిగా దెబ్బతినడంతో సంఘం నాయకులు రూ.16 వేలతో మరమ్మతులు చేయించి ప్రిన్సిపాల్ సత్యనారాయణకు అందించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు సైసుల్‌పాషా, అబ్దుల్ సమీ, అబ్దుల్‌మాలిక్, వార్డెన్ ఎండీ రఫీ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న కరుణశ్రీ

కూసుమంచి: దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు గట్టుసింగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నెల్లూరి వీరభద్రం బహుమతులను సమకూర్చగా ఇన్‌చార్జ్ తహసీల్దారు కరుణ శ్రీ అందజేశారు. దివ్యాంగులు మనోధైర్యం కోల్పోవద్దని, వారిని చిన్నచూపు చూసేకంటే ఆదరించాలన్నారు.

శాశ్వత పరిష్కారం చూపించాలి



అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో సారథినగర్–మామిళ్లగూడెం రైల్వే అండర్ బ్రిడ్జి సేవలను ప్రజలకు అందుబాటులో తేవడాన్ని ఆహ్వానిస్తున్నామని, ఈ బ్రిడ్జి మనుగడకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ కోరారు. సోమవారం పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అండర్ బ్రిడ్జిని నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ బ్రిడ్జి నిర్మాణానికి సీపీఎం శ్రీకారం చుట్టిందని, నాడు మున్సిపల్ చైర్మన్ సమీనా అఫ్రోజ్ పాలకవర్గంలోనే రూ. 52 లక్షలు కేటాయించినట్టు గుర్తు చేశారు. వర్షాలు వచ్చినప్పుడు ప్రజలు ఇబ్బంది పడకుండా వరద నీరు పోవడానికి శాస్త్రీయ పద్ధతిలో కాల్వలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, జబ్బర్, ఎస్.నవీన్‌రెడ్డి, తిరుపతిరావు, పార్టీ మండల కార్యదర్శులు భుక్యా శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, నాగులు మీరా, బత్తిని ఉపేందర్, మీరా సాహిబ్, కార్పొరేటర్లు ఎల్లంపల్లి వెంకట్రావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండకు చెందిన ఓ మహిళ(45) సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె అధిక మోతాదులో మాత్రలు మింగగా, కుటుంబీకులు గుర్తించి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆమె ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	36	బచ్చలికూర	3
వంకాయ	28		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	34		20
కాకర	38	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	54	తోటకూర	3
దొండ	38		20
పొట్లకాయ	38	గోంగూర	4
చిక్కుడు	44		20
గోరుచిక్కుడు	28	మెంతికూర	2
క్యాబేజీ	28		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	36		40
చామగడ్డ	38	పుదీన	1
క్యారెట్	68		25
బీన్స్	54	-ఖమ్మం వ్యవసాయం	

ప్రమాదాల మలుపు..

- ఆటోనగర్ సమీపాన మృత్యుమార్గం
- స్పీడ్‌బ్రేకర్లు లేక తరచూ ప్రమాదాలు
- నాలుగేళ్లలో పది మంది వరకు మృత్యువాత



ప్రమాదాలకు నిలయంగా మారిన గ్యాస్ గోదాం సమీపంలోని మలుపు

ఖమ్మంరూరల్: రూరల్ మండలం ఏదులాపురం శివారు ఆటోనగర్ సమీపంలో ఉన్న ఈ మలుపు అంటేనే ప్రయాణికులు, వాహనదారులు హడలిపోతున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో కోదాడ క్రాస్‌రోడ్, వరంగల్ క్రాస్ రోడ్‌కు మధ్య భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద ఉన్న మలుపులో నిత్యం ప్రమాదాలు సర్వసాధారణమయ్యాయి. ఇక్కడి ఘటనలో పలువురు మృతి చెందడం, మరికొంత మంది గాయపడటం పరిపాటిగా మారిపోయింది.

నిత్యం వాహనాల రద్దీ

ఖమ్మం నుండి హైదరాబాద్, వరంగల్, కోదాడ వెళ్లడానికి, అదే విధంగా హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు ప్రతీ రోజూ వేలాది వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. కీలకమైన ఈ మార్గంలో వాహనాల రద్దీ బాగా పెరిగిపోవడం, వాహనదారులు కూడా జాగ్రత్తలు పాటించక అతివేగంగా నడపటం సర్వసాధారణమైంది. మరోపక్క నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పోలీసు శాఖ తరపున హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలకు ఈ మలుపు కేరాఫ్‌గా మారింది.

కుటుంబాల్లో వేదన..

గతంలో ఇక్కడ పలు ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో వాహనదారులు మృతి చెందారు. మూడేళ్ల క్రితం ఆర్టీసీ బస్సు రెండు ద్విచక్రవాహనాలను ఢీ కొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మరో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందారు. రెండేళ్ల క్రితం బైక్ లారీ ఢీ కొట్టడంతో ముదిగొండ మండలానికి చెందిన దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం జరిగిన ప్రమాదంలో మరో ఇద్దరు బైక్‌పై వెళ్తున్న వారు కూడా మృతి చెందారు. ఆరు నెలల క్రితం ఇదే ప్రాంతంలో బైక్ టిప్పర్ ఢీ కొనడంతో బైక్‌పై ఉన్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. తాజాగా ఈ నెల5న ఇదే మలుపు వద్ద ఆర్టీసీ బస్సును బైక్ ఎదురుగా ఢీకొట్టడంతో తిరుమలాయపాలెం మండలం హైదర్‌సాయిపేట శివారు పడమటితండాకు చెందిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఇలా నాలుగేళ్లలోనే పది మంది వరకు మృత్యువాత పడగా ఆయా కుటుంబాల్లో వేదన మిగులుతోంది.

పోలీసుశాఖ పరంగా జాగ్రత్తలు

రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీస్ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రతీ ఒక్కరూ ఈ మలుపు వద్ద నెమ్మదిగా వెళ్లాలి. అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. అతివేగం ప్రమాదకరమని గుర్తించడమే కాక ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించే వాహనం నడపాలి. ఈవిషయమై వాహనదారులకు అవగాహన కల్పిండంతో పాటు నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధిస్తూ, అవసరమైతే కేసులు నమోదు చేస్తున్నాం.

– ముష్క రాజు, సీఐ, ఖమ్మం రూరల్

ప్రమాదాలకు కారణాలివే..

ఈ రోడ్డుపై వెళ్లే వచ్చే వాహనాలు అతి దగ్గరకు వచ్చే వరకు కనిపించవు. తీరా ప్రమాదం ఉంటుందని ఊహించి వాహనాలను పక్కకు తిప్పేలోపే జరగాల్సిన అనర్థం జరిగిపోయి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇదే పరిస్థితి రోడ్డుకిరువైపులా ఉండటంతో పలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూలమలుపు వద్ద స్పీడ్‌బ్రేకర్లు ఎత్తు పెంచడమో, లేక ప్రమాదాల నివారణకు అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళ్లు తెరిచి హెచ్చరిక బోర్డులు పెట్టడం, ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చూసి ప్రమాదాలకు చెక్ పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రతీ సమస్యకు పరిష్కారం..

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఆయా సమస్యలకు పరిష్కారం చూపించేందుకు చర్యలు చేపడుతున్నట్టు కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం కేఎంసీలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో 42మంది తమ సమస్యలపై ఫిర్యాదులు చేయగా.. వీటిలో అధికంగా రెవెన్యూ, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులున్నాయి. వీటిని పరిశీలించిన కమిషనర్ పక్కనే ఉన్న ఆయా విభాగాల అధికారులకు వాటిని అందజేసి తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

మారిన వేదిక..

కేఎంసీలో ప్రతిసారి గ్రీవెన్స్‌ను మొదటి అంతస్తులోని కమిషనర్ చాంబర్ పక్కన సమావేశ మందిరంలో ఏర్పాటు చేస్తుంటారు. దీంతో ప్రజలు మొదటి అంతస్తు వరకు వచ్చి సమస్యలు అధికారులకు విన్నవించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా గ్రీవెన్స్‌ను కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లోనే నిర్వహించేలా కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. దీనిలో భాగంగా ఈ సోమవారం కమిషనర్‌తోపాటు ఆయా విభాగాల అధికారులకు ప్రత్యేక కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటు చేశారు. వీటితోపాటు గ్రీవెన్స్ ఫిర్యాదుల నమోదుకు హెల్ప్‌డెస్క్‌ను ముందు భాగంలో ఉంచారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజలు మారిన వేదికను చూసి హర్షం వ్యక్తం చేశారు. ఈ గ్రీవెన్స్‌లో ఏఓ శివలింగం, ఏసీపీ వసుంధర, ఏఎస్‌ఓ లింగయ్య, ఆర్‌ఐ విజయానంద్, శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలు లేకుండా ఎంపిక చేపట్టాలి



తిరుమలాయపాలెం: సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ



నేలకొండపల్లి: బోదులబండలో..

తిరుమలాయపాలెం: లబ్ధిదారుల ఎంపికను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని, ఎలాంటి అవకతవకలు జరగకుండా నిర్దేశించిన సమయం నాటికి సర్వే పూర్తి చేయాలని ఖమ్మం ఆర్డీఓ జి.నర్సింహారావు ఆదేశించారు. మొబైల్ యాప్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని తిరుమలాయపాలెం, పిండిప్రోలులో గ్రామాలలో చేపడుతున్న సర్వేను పరిశీలించి ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు నమోదు ప్రక్రియ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, తహసీల్దార్ పి.వి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సర్వే ప్రారంభించారు. మండలంలోని కొత్తకొత్తూరు, బోదులబండ, నేలకొండపల్లి తదితర గ్రామాల్లో సర్వేను ఎంపీడీఓ యం.యర్రయ్య, తహసీల్దార్ జె.మానిక్‌రావ్ పర్యవేక్షించారు. ప్రజాపాలనలో ఇళ్ల కోసం దరఖాస్తుసుకున్న లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. కొత్తకొత్తూరులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్వే బృందం సభ్యులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి



ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రదర్శన

ఖమ్మం మామిళ్లగూడెం: చట్టాలు ఎన్ని చేసినా అధికారం, డబ్బులున్న వారికే చట్టాలు, చుట్టాలుగా మారాయని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అన్నారు. మానవహక్కుల దినం సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహిళా సాధికారితకు చట్టం తేవాలని డిమాండ్‌తో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి బండి పద్మ మాట్లాడుతూ.. మహిళలకు రాజ్యాంగం ఆహారభద్రత కల్పించాలని ఆదేశించినా పాలకులకు చిత్తశుద్ధిలేక అమలు కావటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాగసులోచన, ప్రభావతి, సుమతి, సునిత, రజిత, అమరావతి, కృష్ణవేణి, ఉమావతి, లక్ష్మి, విజయ, వెంకట్రావమ్మ, సుగుణమ్మ, కుమారి, పావని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులుగా నమోదు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విశ్వబ్రాహ్మణులందరిని ఒకే కేటగిరిగా నమోదు చేయాలని కోరుతూ సోమవారం సంఘం నాయకులు అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పెందోట సోమేశ్వరాచారి, జిల్లా కోశాధికారి వెగ్గలం వెంకటేశ్వర్లు, సదానంద చారి, నగర ప్రధాన కార్యదర్శి దేశరాజు వెంకటేశ్వర్లు, కోశాధికారి నందిగామ వీరబ్రహ్మాచారి పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపిక

ఖమ్మంఅర్బన్: స్థానిక బొమ్మ కాలేజీలో సోమవారం వివిధ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో పలువురు విద్యార్థులు ఎంపికైనట్టు చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు తెలిపారు. కె.టెల్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 8 మంది విద్యార్థులు ఎంపికై నట్లు తెలిపారు. విద్యార్థులను చైర్మన్, వైస్ చైర్మన్ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ భిక్షం, కిరణ్‌జ్యోతి అభినందించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కూసుమంచి: మండల కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో నాణ్యత లోపిస్తుందని, దీనిపై దృష్టి సారించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో ఇన్‌చార్జి తహసీల్దారు కరుణశ్రీ కి బీజేపీ నాయకులు గుండా ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో సీసీ రహదారుల నిర్మాణం, అదనపు తరగతి గదుల నిర్మాణాలు సాగుతుండగా ఆ నిర్మాణాల్లో నాసిరకం ఇసుక వినియోగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే డ్రైయినేజీల్లో పూడిక తీయించకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

గ్రంథాలయం ఏర్పాటుచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఇజ్రాయిల్

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడులో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం మాజీ సర్పంచ్ మందడి ఇజ్రాయిల్ గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. గతంలో గ్రామంలో గ్రంథాలయం ఉండేదని దానిని తొలగించారని, మళ్లీ గ్రంథాలయం ఏర్పాటు చేసి పత్రికలు, పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలన్నారు.

ఎస్‌బీఐటీలో ఫ్రెషర్స్‌డే వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కృష్ణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు సోమవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ... ప్రతీ వ్యక్తి వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరి అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివ ప్రసాద్, జె.రవీంద్ర బాబు, ఎస్. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వజ్ఞలో గ్రీన్ డే..



విద్యార్థులతో డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలోని సోమవారం గ్రీన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, నీలిమలు మాట్లాడగా ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ఫెలోషిప్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

రఘునాథపాలెం: మండల పాస్టర్ల ఫెలోషిప్ నూతన కమిటీని సోమవారం జింకలతండా రోడ్డులోని గ్రీన్‌కాలనీలోని పాస్టర్ జి.జాకబ్ యేసు అగ్ని ప్రార్థన మందిరంలో ఫౌండర్ జగన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడి బ్రదర్ జాన్ వెస్లీ, సెక్రటరీగా అత్తోట సురేష్, ఉపాధ్యక్షుడిగా సురేష్, జాయింట్ సెక్రటరీగా హనోక్, ట్రెజరరీగా అంతోటి సురేష్, జాయింట్ ట్రెజరరీగా దివ్య ప్రసాద్, గౌరవ సలహాదారుడిగా లాజర్ నాయక్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా క్రాంతి, ఐజాక్, స్టాలిన్‌లను ఎన్నుకున్నారు.

ధ్యాన మందిరంలో కచేరీ

నేలకొండపల్లి: స్థానిక భక్తరామదాసు ధ్యాన మందిరంలో సోమవారం భజన మండలి సభ్యులు ప్రత్యేక కచేరీ నిర్వహించారు. హనుమకొండ జిల్లా, కమలాపూర్ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన శ్రీ రామాంజనేయ భజన మండలి బృందం కీర్తనలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల సొసైటీ అధ్యక్షుడు సిద్దేశ్వరస్వామి, మండలి అధ్యక్షులు సింధు, మంజుల, సమత, సునీత, రమా, రాజక్క, రజిత, కమల, రాజమణి, బుచ్చక్క, కళావతి, స్వరూప, రాధ, సభ్యులు కొత్తా రాణి, తేజావత్ శివాజీ, సత్యనారాయణ, భూక్యా జ్యోతి ఉన్నారు.

ఆర్‌ఐలకు రెవెన్యూ వార్డుల కేటాయింపు

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఉత్తర్వులు అందించారు. గతంలో ముగ్గురు ఆర్‌ఐలు ఉండగా.. వారికి తోడుగా మరో ఇద్దరికి బాధ్యతలు అప్పగించడంతో ఐదుగురు ఆర్‌ఐలుగా ఉన్నారు. వీరంతా ఇన్‌చార్జి ఆర్‌ఐలుగా ఉండటం గమనార్హం. వీరికి తాజాగా రెవెన్యూ వార్డులను కేటాయిస్తూ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు కె.శ్రీనివాస్‌కు 1, 2, 3, 4, 12 వార్డులు, ఆర్.విజయానంద్‌కు 5, 15–7 నుంచి 15–16 వరకు, ఎ.జ్యోతికి 6, 7, 9, 10, 11–8 నుంచి 11–12 వరకు, వి.రామారావుకు 8, 15–1 నుంచి 15–6 వరకు, 15–17 నుండి 15–21 వరకు, ఎ.సుధాకర్ 11–1 నుంచి 11–7 వరకు, 13, 14, 16,17,18, 19, 20 వార్డులు కేటాయించారు. ఇదిలా ఉండగా ఐదుగురు ఆర్‌ఐలకు ఇద్దరు ఆర్‌ఐలు మాత్రమే ఉత్తర్వులు తీసుకున్నారు. మరో ముగ్గురు వాటిని మూడు రోజులుగా తీసుకోకుండా తీరిక లేదని దాటవేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక ఎస్టాబిస్‌మెంట్ సెక్షన్ బాధ్యతలను ఇంకా ఎవరికీ కేటాయించలేదు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి

రఘునాథపాలెం: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న హైదరాబాదు ఇందిరాపార్క్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని మంచుకొండ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో సీతారాములు, గుగులోతు రాందాస్, మండల అధ్యక్షుడు మంగీలాల్, శ్రీను, కోటేశ్వరరావు, రేణుక , మంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధరలు నియంత్రించండి

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ ఇచ్చిన ఆరుగ్యారంటీలతో అమలు చేసి, నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ సలాం డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం నర్సింహస్వామి గుట్ట వద్ద కేఎస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... రోజురోజుకు అధిక ధరలతో సామాన్య ప్రజలు ఒక పూట గడవని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివారెడ్డి, నూనేశశిధర్, రమణ, చానా, శేఖర్‌నాయక్, ఉపేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూనె గింజల ఉత్పత్తిదారుల సంఘాన్ని పునరుద్ధరించాలి

ఖమ్మంఅర్బన్: నగరంలోని బాలపేట నూనే గింజల ఉత్పత్తిదారుల సంఘం సమావేశం సోమవారం మహాజనసభ నిర్వహించారు. జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు లిక్విడేట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కాపర్తి కిషోర్ సంఘ సభ్యులతో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సంఘాన్ని పునరద్ధరించి ఎన్నికలు నిర్వహించి రైతులకు, ఆ ప్రాంతం ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నివేదికలను జిల్లా అధికారికి అందజేస్తామని కిషోర్ తెలిపారు.

బిల్లులు అడిగితే అరెస్ట్ సరికాదు



నేలకొండపల్లి: పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు..



రఘునాథపాలెంలో..

నేలకొండపల్లి: అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేసి బిల్లులు అడిగితే అరెస్టులు చేస్తున్నారని, ఇది సరికాదని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గండు సతీష్ ఆరోపించారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ చేపట్టిన చలోఅసెంబ్లీకి వెళ్లకుండా స్థానిక పోలీసులు తాజా మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... మాజీ సర్పంచ్‌లు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, పెండింగ్ బిల్లులు విడుదల చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు. భూక్యా సుధాకర్, టి.వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ అనగాని నరసింహారావు పాల్గొన్నారు.

రఘునాథపాలెం: చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మండలంలోని పలు పంచాయతీల తాజీ మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా రఘునాథపాలెం పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి వ్యక్తి గత పూచీపై విడుదల చేశారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి చేసిన పనులు బిల్లులు రాక కొంతమంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకోవడం జరిగిందని, న్యాయమైన సమస్యల కోసం వెళ్తుంటే అడ్డుకోవడం దారుణమన్నారు. సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు మాదంశెట్టి హరిప్రసాద్, మాజీ సర్పంచ్‌లు కొర్లపాటి రామారావు, దారాశ్యామ్ సుందర్, మోతిలాల్, పాండు, కంపతి లలితా తదితరులు ఉన్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



ఖమ్మంవన్‌టౌన్: కేక్‌కట్ చేస్తున్న దుర్గాప్రసాద్



కూసుమంచిలో..

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అనే ప్రజల ఆకాంక్షను తీర్చింది సోనియాగాంధీ అని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం ఆమె జన్మదినం పురస్కరించుకుని కాంగ్రెస్ జిల్లా కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్‌లో 300 మంది వృద్ధులకు, అనాథలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పులిపాటి వెంకయ్య, పుచ్చకాయల వీరభద్రం, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, రాపర్తి శరత్, మొక్కా శేఖర్‌గౌడ్, ఎండీవై పాషా, ఏలూరి రవికుమార్, బాలాజీ, తేజావత్ హుస్సేన్, సౌజన్య, లక్ష్మణ్, చల్లా ప్రతిభారెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి, ఎంపీ కార్యాలయాల్లో

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి క్యాంపు ఆఫీస్‌లో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబీ స్వర్ణకుమారిలు కేక్‌కట్ చేశారు. సౌజన్య, మిక్కిలినేని నరేందర్, మనోహర్, తాళ్లూరి రాము, ఉమ్మినేని కృష్ణ, బోడా శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు.

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. మాదంశెట్టి హనుమంతరావు, మానుకొండ రాధాకిషోర్, ముత్తయ్య, సీతారాములు, రాంప్రసాద్, చెరుకూరి పూర్ణ, ముత్తయ్య ఉన్నారు.

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ అశోక్, అరవిందరెడ్డి, ఇజ్రాయిల్, లింగన్న, ఇమామ్, నజీర్, ఊడుగు ఉపేందర్ పాల్గొన్నారు.